
# నవతరం
నేటితరం కోసం...

హైదరాబాద్ | ఆదివారం, డిసెంబరు 28, 2025 | సంపుటి:11 | సంచిక : 249 | పేజీలు: 4 | వెల : రూ.5


## శాంతి చర్చలకు మొగ్గు చూపకపోతే సైనిక చర్యే.. ఉక్రెయిన్‌కు పుతిన్ హెచ్చరిక

- లక్ష్యాల సాధన కోసం ఎంతటికైనా తెగిస్తామన్న రష్యా అధ్యక్షుడు
- ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు
- 500 డ్రోన్లు, 40 క్షిపణులతో విరుచుకుపడిన సైన్యం
- ఫ్లోరిడాలో డొనాల్డ్ ట్రంప్‌తో నేడు భేటీ కానున్న జెలెన్స్కీ



# రైతుల్ని ఏకం చేయాలి

- నరేగా మార్పులపై గ్రామస్థాయి ఉద్యమానికి పిలుపు
- జీ రామ్‌జీ చట్టంతో అన్నదాతలకు తీవ్ర నష్టం
- ఇండియా కూటమి పార్టీలతో కలిసి ముందుకు: సీఎం రేవంత్



న్యూఢిల్లీ, డిసెంబరు 27 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా)లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులకు వ్యతిరేకంగా రైతులు, కూలీలను సంఘటితం చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నరేగాను బలహీనపరిచే ప్రయత్నాలను పల్లెపల్లెకూ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని, గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున 'ఉపాధి ఉద్యమం' నిర్మించాలని పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో శనివారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన ఈ ప్రతిపాదన చేశారు. నరేగా స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన జీ రామ్‌జీ చట్టం రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని సీఎం హెచ్చరించారు. కోట్లాది గ్రామీణ కార్మికులకు జీవనాధారంగా నిలిచిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా గ్రామీణ వ్యవస్థనే కూల్చే ప్రయత్నం

(మిగతా 2వ పేజీలో)

# నన్ను చాలా మంది ఐఏఎస్ చేయమన్నారు: సీఎం చంద్రబాబు

- ఐఏఎస్ అవ్వమన్నా ప్రజాసేవకే ప్రాధాన్యతనిచ్చానన్న చంద్రబాబు
- తన అర్ధాంగి నారా భువనేశ్వరి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడిన సీఎం
- గండిపేట ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవంలో పాల్గొన్న చంద్రబాబు దంపతులు
- విలువలతో కూడిన విద్యతోనే సమాజంలో గుర్తింపు సాధ్యమని హితవు

తనను చాలామంది ఐఏఎస్ అధికారి కావాలని సూచించారని, కానీ తాను ప్రజాసేవకే ప్రాధాన్యతనిచ్చి రాజకీయాల వైపు అడుగులు వేశానని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. యూనివర్సిటీ నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచానని, అనతికాలంలోనే మంత్రిగా, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు నాలుగోసారి సీఎంగా సేవ చేసే అవకాశం లభించిందని తెలిపారు. హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకల్లో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా తన సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిపై ఆయన ప్రశంసలు కురిపించారు. తాను రాజకీయాల్లో తీరిక లేకుండా ఉన్న సమయంలో, అయిష్టంగానే హెరిటేజ్ బాధ్యతలు స్వీకరించిన భువనేశ్వరి, తన పట్టుదలతో ఆ సంస్థను అద్భుతంగా అభివృద్ధి చేశారని కొనియాడారు. "నేను ఇప్పటికీ కాగితం చూసి ప్రసంగిస్తుంటే, భువనేశ్వరి ట్యాబ్ చూసి మాట్లాడుతున్నారు. నేను టెక్నాలజీ గురించి చెబుతుంటాను, ఆమె టెక్నాలజీని ఆచరణలో పెట్టి వినియోగిస్తున్నారు. మామగారు ఎన్టీఆర్ మాదిరిగానే భువనేశ్వరికి పట్టుదల, మొండితనం ఉన్నాయి. ఏదైనా పని మొదలుపెడితే పూర్తిచేసే వరకు వదలరు" అని అన్నారు. భార్యగా, తల్లిగా, వ్యాపారవేత్తగా, ట్రస్టీగా బహుముఖ పాత్రలను



సమర్థవంతంగా పోషిస్తున్నారని అభినందించారు. హెరిటేజ్ సంస్థను అద్భుతంగా నడిపిస్తున్నందుకు లండన్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్' సంస్థ భువనేశ్వరికి గోల్డెన్ పీకాక్ అవార్డుతో పాటు వ్యక్తిగత పురస్కారాన్ని కూడా అందించిందని గుర్తు చేశారు. అంతకుముందు, గండిపేట ప్రాంగణానికి విచ్చేసిన చంద్రబాబు దంపతులకు ఎన్టీఆర్ విద్యా సంస్థల విద్యార్థులు గౌరవ వందనం సమర్పించారు. ప్రాంగణంలో కలియతిరుగుతూ పాత స్మృతులను

(మిగతా 2వ పేజీలో)

# "డ్రగ్స్" కేసుపై బాంబు పేల్చిన బండి సంజయ్

- పండుగలప్పుడే డ్రగ్స్ కేసులు నమోదు చేస్తారా?
- అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో నాటి డ్రగ్స్ కేసు విచారణ ఏమైంది?
- అనేక మంది సెలబ్రిటీల పేర్లు బయటకు వచ్చాయి కదా?
- కేసీఆర్ కుటుంబ సభ్యులకు సైతం తమతోపాటు డ్రగ్స్ తీసుకున్నారని నిందితులు వాంగ్మూలమిచ్చారు
- నిందితుల వాంగ్మూలంతోపాటు ఆడియో, వీడియోలను రికార్డు చేసింది
- ఆ ఆధారాలన్నీ ఏమయ్యాయో ఎందుకు విచారణ జరపడం లేదు?
- అసలు ఈగల్ టీం బాధ్యతలు నిర్వర్తిస్తోందా?
- రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



'పండుగలు, నూతన సంవత్సరం వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితం అవుతున్నారే తప్ప రాష్ట్ర పభుత్వం సీరియస్ గా వ్యవహరించడం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన

(మిగతా 2వ పేజీలో)



## వివాహంతో ముగిసిన రేప్ కేసు దోషిపై శిక్షను రద్దు చేసిన సుప్రీంకోర్టు

అరుదైన పరిణామమని వ్యాఖ్యానించిన ధర్మాసనం

న్యూఢిల్లీ:విభేదాలతో ఒక మహిళ తనపై అత్యాచార కేసు నమోదు చేసిన వ్యక్తినే చివరికి పెళ్లాడుతుందని తాము ముందే ఊహించామని, తమ 'సిక్స్త్ సెన్స్' అదే చెప్పిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బాధితురాలు, నిందితుడు వివాహం చేసుకుని సంతోషంగా జీవిస్తున్న నేపథ్యంలో

(మిగతా 2వ పేజీలో)

# గత సర్కార్ రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసింది

- అప్పుల భారం ఉన్నా సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయి
- అనంతనగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభం
- రైతులు, పేదలే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



నేలకొండపల్లి, డిసెంబరు 28:గత పాలకులు ప్రజలపై రూ.8 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోపినా, ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఆపకుండా కొనసాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా

(మిగతా 2వ పేజీలో)

# రాష్ట్రాల హక్కులే లక్ష్యం: రాహుల్

- జీ రామ్ జీతో పేదల ఉపాధికి గండి
- ఫెడరల్ వ్యవస్థను కూల్చే ప్రయత్నం




న్యూఢిల్లీ, డిసెంబరు 27:మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడం రాష్ట్రాలపై ప్రత్యక్ష దాడేనని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. ఈ చర్య ద్వారా రాష్ట్రాల నిర్ణయాధికారాన్ని కేంద్రం తన చేతుల్లోకి లాక్కునే

(మిగతా 2వ పేజీలో)



## ఈగిల్ విచారణలో రకుల్ సోదరుడి పేరు

- రెండోసారి డ్రగ్స్ లింక్ బయటపడటం సంచలనం
- అమన్‌ప్రీత్‌పై వేటకు ప్రత్యేక పోలీసు బృందాలు

# పాలమూరు నిర్లక్ష్యమే 90 టీఎంసీల నష్టానికి కారణం

- కాళేశ్వరం వేగం పాలమూరుకు ఇవ్వలేదు
- నీటి హక్కుల కోల్పోవడంలో రెండు ప్రభుత్వాలదే తప్పు
- డైవర్షన్ల పేరుతో కొత్త కరప్షన్: కవిత ఫైర్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 27:పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై ప్రభుత్వాల నిర్లక్ష్యం తెలంగాణకు భారీ నష్టాన్ని తెచ్చిపెట్టిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును పరుగులు పెట్టించిన వేగం పాలమూరు ప్రాజెక్టుకు ఇవ్వకపోవడమే కృష్ణా జలాల్లో 90 టీఎంసీల నీటి వాటా చేజారడానికి ప్రధాన కారణమని ఆమె వ్యాఖ్యానించారు. నిర్దేశించిన గడువులో ప్రాజెక్టు పూర్తయ్యి ఉంటే ఈ రోజు తెలంగాణకు నీటి హక్కుల విషయంలో బలమైన స్థానం ఉండేదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సమానంగా బాధ్యత వహించాల్సి



ఉంటుందని కవిత అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన నిర్లక్ష్యం కాంగ్రెస్ పాలనలోనూ కొనసాగుతోందని విమర్శించారు. అప్పటి ప్రభుత్వంలో లెక్కలేనంత అవినీతి జరిగిందని, నాటి మంత్రి హరీశ్‌రావు నిర్వాకంతో కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో

(మిగతా 2వ పేజీలో)

# "డ్రగ్స్" కేసుపై బాంబు పేల్చిన బండి సంజయ్

'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తుల పేర్లు, సినీ ప్రముఖులు ఉన్నారంటూ బండి సంజయ్ బాంబు పేల్చారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే కేసీఆర్ కుటుంబ సభ్యులకు డ్రగ్స్ విక్రయదారులతో సంబంధాలున్నాయని తేలిందన్నారు. ఆ కుటుంబ సభ్యులు సైతం తమతో కలిసి డ్రగ్స్ తీసుకున్నారని డ్రగ్స్ కేసులో పట్టుబడి నిందితులు ఆనాడు అకున్ టీం ఎదుట వాంగ్మూలమిచ్చారని పేర్కొన్నారు. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకొస్తే తన కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తు సమాధి అవుతుందని భయపడ్డ నాటి సీఎం కేసీఆర్ ఆకున్ సబర్వాల్ ను అర్ధాంతరంగా డ్రగ్స్ కేసు బాధ్యతల నుండి తప్పించారని తెలిపారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదికను, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్ మెంట్లన్నింటినీ నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ తరువాత డ్రగ్స్ కేసును పూర్తిగా నీరుగార్చారని మండిపడ్డారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీంకు అప్పగించలేదని, వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదని తెలిపారు. ఈ మేరకు బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న "ఈగల్" టీం వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్ ను విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈగల్ టీం విచారణ తీరుపైనా ఈ సందర్భంగా బండి సంజయ్ అనుమానం వ్యక్తం చేశారు. ఈగల్ టీంకు నిజంగా లీగల్ గా అధికారాలున్నాయా? అని ప్రశ్నించారు. ఈగల్ టీంలో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు అధికారులు మాత్రం డబ్బులకు అమ్ముడుపోయి డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని తెలిపారు. నిన్నటి ఈగల్ టీం దాడిలో పెడ్లర్ల నుండి డ్రగ్స్ కొనుగోలు చేసిన ఇంతవరకు ఎందుకు అరెస్ట్



చేయలేదు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో విచ్చల విడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే... అకున్ సబర్వాల్ వంటి సమర్ధులైన అధికారులకు తిరిగి 'డ్రగ్స్ కేసు' విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు. అట్లా కాకుండా డ్రగ్స్ కేసు విచారణ తేల్చకుండా తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసినంత మాత్రాన రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన సాధ్యం కానేకాదని స్పష్టం చేశారు.

# వివాహంతో ముగిసిన రేప్ కేసు దోషిపై శిక్షను రద్దు చేసిన సుప్రీంకోర్టు

రేప్ కేసులో విధించిన శిక్షను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఈ అరుదైన తీర్పు ఇచ్చింది.మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి అత్యాచారం చేశాడన్న కేసులో దోషిగా తేలి పదేళ్ల కఠిన కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. ట్రయల్ కోర్టు, హైకోర్టులు అతడిని దోషిగా నిర్ధారించడంతో చివరకు అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం విచారించింది.కేసు విచారణ సందర్భంగా బాధితురాలు, నిందితుడు ఇప్పటికే వివాహం చేసుకుని గత ఆరు నెలలుగా కలిసి జీవిస్తున్న విషయం కోర్టు దృష్టికి వచ్చింది. ఈ పరిణామాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, హైకోర్టు విధించిన శిక్షను రద్దు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. "బాధితురాలు ఒకవేళ వివాహానికి అంగీకరిస్తే ఇద్దరూ మళ్లీ కలిసిపోతారని మేం ముందే ఊహించాం. మా సిక్స్త్ సెన్స్ అదే చెప్పింది. ఇలాంటి కేసులు నిజంగా అరుదైనవే" అని న్యాయమూర్తులు పేర్కొన్నారు.ఈ కేసు నేపథ్యాన్ని వివరిస్తూ, 2015లో సామాజిక మాధ్యమాల ద్వారా ఇద్దరికీ పరిచయం ఏర్పడిందని, కొంతకాలం సహజీవనం చేశారని కోర్టు గమనించింది. అనంతరం విభేదాలు తలెత్తడంతో పెళ్లి వాయిదా పడిందని, ఆ సమయంలో యువతి ఆగ్రహంతో అత్యాచార ఆరోపణలతో ఫిర్యాదు చేసినట్లు వెల్లడైంది. 2021లో ఎఫ్ఐఆర్ నమోదు కాగా, గత ఏడాది ట్రయల్ కోర్టు దోషిగా తేల్చింది. హైకోర్టులోనూ అదే తీర్పు కొనసాగింది.అప్పీల్ సందర్భంగా సుప్రీంకోర్టు ఇద్దరినీ, వారి కుటుంబసభ్యులను పిలిపించి వివాహానికి ఇరువైపులా సమ్మతి ఉందని నిర్ధారించింది. పెళ్లి చేసుకునేందుకు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఆ తరువాత వివాహం జరగడంతో కేసును తిరిగి విచారించిన ధర్మాసనం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద ఉన్న అసాధారణ అధికారాలను ఉపయోగించి ఎఫ్ఐఆర్, ట్రయల్ కోర్టు తీర్పును రద్దు చేసింది. దీంతో హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు కూడా నిర్వీర్యమైందని స్పష్టం చేసింది.



# పాలమూరు నిర్లక్ష్యమే 90 టీఎంసీల నష్టానికి కారణం

ఇప్పటికీ మూడే మోటార్లు పనిచేస్తున్నాయని తెలిపారు.తెలంగాణ జాగృతి 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా శనివారం నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో పర్యటించిన కవిత వట్టెం రిజర్వాయర్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. రిజర్వాయర్ సామర్థ్యం, నిర్వాసితుల సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. అనంతరం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవల పరిస్థితిని పరిశీలించారు.విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వరద జలాల ఆధారంగా నల్లమల సాగర్‌ను నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలు తెలంగాణ ప్రయోజనాలకు ముప్పుగా మారుతాయని హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో డైవర్షన్ల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త కరప్షన్‌కు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. స్వల్ప నిధులతో పూర్తయ్యే పనులకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. రెండేళ్ల పాలనలో ఈ పథకంలో రెండు తట్టల మట్టికూడా తీయలేదని మండిపడ్డారు.

### శాంతి చర్చలకు మొగ్గు చూపకపోతే సైనిక చర్యే..

# ఉక్రెయిన్‌కు పుతిన్ హెచ్చరిక


**లక్ష్యాల సాధన కోసం ఎంతటికైనా తెగిస్తామన్న రష్యా అధ్యక్షుడు**

**ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు**

**500 డ్రోన్లు, 40 క్షిపణులతో విరుచుకుపడిన సైన్యం**


**ఫ్లోరిడాలో డొనాల్డ్ ట్రంప్‌తో నేడు భేటీ కానున్న జెలెన్‌స్కీ**

**ఉక్రెయిన్‌కు భారీ ఆర్థిక సాయం ప్రకటించిన కెనడా**



ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కీవ్ (ఉక్రెయిన్) పాలకులకు శాంతియుత మార్గంలో వివాదాన్ని పరిష్కరించుకోవడం ఇష్టం లేదని విమర్శించారు. ఒకవేళ దౌత్యం విఫలమైతే 'ప్రత్యేక సైనిక చర్య' తప్పదని, లక్ష్యాలన్నింటినీ బలప్రయోగం ద్వారానే సాధిస్తామని హెచ్చరించారు. పుతిన్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలోనే రష్యా దళాలు ఉక్రెయిన్‌పై కనీవినీ ఎరుగని రీతిలో దాడులకు తెగబడ్డాయి. రాత్రంతా జరిగిన ఈ దాడుల్లో సుమారు 500 డ్రోన్లు, 40 క్షిపణులను రష్యా ప్రయోగించింది. ఈ భీకర దాడిలో ఒకరు మృతి చెందగా, 27 మంది గాయపడ్డారు. రష్యాకు యుద్ధం ఆపే ఉద్దేశం లేదనడానికి ఈ 10 గంటల విధ్వంసమే నిదర్శనమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు.దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న ఈ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలను వెతకడానికి జెలెన్‌స్కీ నేడు అమెరికాలో డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఫ్లోరిడాలో జరగనున్న ఈ సమావేశంలో భద్రతా హామీలు, వివాదాస్పద ప్రాంతాలపై చర్చించనున్నారు. ట్రంప్‌తో భేటీకి ముందు కెనడా చేరుకున్న జెలెన్‌స్కీ శాంతి స్థాపన కోసం తాము చేస్తున్న ప్రయత్నాలకు రష్యా అడ్డుతగులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఉక్రెయిన్‌పై రష్యా జరుపుతున్న దాడులను కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా ఖండించారు. ఈ దాడులను ఆయన 'అమానవీయమైనవి'గా అభివర్ణించారు. శాంతి స్థాపన జరగాలంటే రష్యా సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో ఉక్రెయిన్ పునర్నిర్మాణం కోసం కెనడా ప్రభుత్వం 2.5 బిలియన్ కెనడియన్ డాలర్ల (సుమారు 1.82 బిలియన్ యూఎస్ డాలర్లు) భారీ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది.

# నన్ను చాలా మంది ఐఏఎస్ చేయమన్నారు: సీఎం చంద్రబాబు



నెమరువేసుకున్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాలను ప్రారంభించిన అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు.ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ, చదువు ఎంత ముఖ్యమో, విలువలు అంతకంటే ముఖ్యమని విద్యార్థులకు హితవు పలికారు. "లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవడంపై దృష్టి సారించాలి. విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చు, అప్పుడు సంపద దానంతట అదే వస్తుంది" అని అన్నారు. తెలుగుదేశం పార్టీ కోసం ప్రాణత్యాగం చేసిన కార్యకర్తల పిల్లలకు ఈ విద్యా సంస్థల ద్వారా విద్యను అందిస్తున్నామని తెలిపారు.

## ఈగిల్ విచారణలో రకుల్ సోదరుడి పేరు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 27:హైదరాబాద్‌లో డ్రగ్స్ వ్యవహారం మరోసారి సినీ వలయానికి చేరుకుంది. ప్రముఖ సినీనటి రకుల్‌ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్ మాదకద్రవ్యాల వినియోగానికి పాల్పడినట్టు ఈగిల్ బృందం గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇటీవల అరెస్టయిన డ్రగ్ పెడ్లర్ల విచారణలో అమన్‌ప్రీత్ పేరు బయటపడిందని తెలిపారు.ట్రూప్‌బజార్‌కు చెందిన డ్రగ్ పెడ్లర్లు నితిన్ సింఘానియా, శ్రనిక్ సింగ్వీని అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద నుంచి 43 గ్రాముల కొకైన్, 11 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో డ్రగ్స్ కొనుగోలు చేసిన వారి వివరాలు సేకరించగా.. అందులో అమన్‌ప్రీత్‌తో పాటు ఆయన స్నేహితుల పేర్లు ఉన్నట్టు తేలింది.డ్రగ్స్ కేసులో అమన్‌ప్రీత్ పేరు రావడం ఇదే తొలిసారి కాదు. గత ఏడాది నార్సింగి పరిధిలో పట్టుబడ్డ డ్రగ్స్ ముఠా కేసులోనూ ఆయన పాత్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అప్పట్లో నిర్వహించిన పరీక్షల్లో డ్రగ్స్ వినియోగం జరిగినట్టు నిర్ధారణ అయింది. ఇప్పుడు మరోసారి డ్రగ్స్ లింక్ బయటపడటంతో పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.అమన్‌ప్రీత్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్టు డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసులో ఎంత పెద్దవారున్నా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అమన్‌ప్రీత్ చిక్కితే సినీ పరిశ్రమకు చెందిన మరికొందరి పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

# రాష్ట్రాల హక్కులే లక్ష్యం: రాహుల్

ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ప్రధాని మోదీ ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయం ఫెడరల్ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేశారు.శనివారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అనంతరం రాహుల్‌గాంధీ మాట్లాడారు. నరేగా వంటి కీలక పథకాన్ని ఎలాంటి అధ్యయనం లేకుండా, మంత్రివర్గాన్ని కూడా సంప్రదించకుండా రద్దు చేయడం నోట్ల రద్దు నిర్ణయాన్ని గుర్తుకు తెస్తోందని వ్యాఖ్యానించారు."నరేగా కోట్లాది మంది కార్మికులకు కనీస వేతనానికి హామీ ఇచ్చిన పథకం. గ్రామీణ పేదలకు జీవనాధారంగా నిలిచింది. ఈ పథకం వల్ల కార్మికులు అవమానకరమైన పరిస్థితుల్లో పనిచేయాల్సిన అవసరం లేకుండా రక్షణ లభించింది. ఇప్పుడు ఆ రక్షణ వ్యవస్థను కూల్చే కుట్ర జరుగుతోంది" అని రాహుల్ అన్నారు.నరేగా ద్వారా గ్రామ పంచాయతీలకు నిధుల పంపిణీ, నిర్ణయాధికారాలు లభించాయని, గ్రామస్థాయిలో ప్రజాస్వామ్య భాగస్వామ్యం బలపడిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఈ పథకాన్ని తొలగించడం అంటే గ్రామ పంచాయతీ వ్యవస్థను బలహీనపరచడమేనని హెచ్చరించారు. జీ రామ్ జీ చట్టం పేరుతో పేదలపై భారం మోపుతూ, కార్పొరేట్లకు లాభం చేకూర్చే విధానాన్ని కేంద్రం అమలు చేస్తోందని ధ్వజమెత్తారు.రాష్ట్రాలకు చెందాల్సిన నిధులను కేంద్రం స్వాధీనం చేసుకోవడం, నిర్ణయాధికారాన్ని లాక్కోవడం దేశ సమాఖ్య వ్యవస్థకు తీవ్ర విఘాతమని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు.

# ఏ11గా అల్లు అర్జున్

హైదరాబాద్ , డిసెంబరు 27 :పుష్ప2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య 70 ఎంఎం థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై చిక్కడపల్లి పోలీసులు న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ దుర్ఘటనలో మహిళ మృతి, ఆమె కుమారుడు జీవచ్ఛవంగా మారడానికి థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యంతోపాటు హీరో అల్లు అర్జున్ రాక కూడా కారణమని పేర్కొంటూ ఆయన్ను ఏ11గా చేర్చారు. మొత్తం 23 మంది నిందితులుగా చార్జిషీట్‌లో పోలీసులు పేర్కొన్నారు.ఈ నెల 24న చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేసిన పోలీసులు, శనివారం దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. చార్జిషీట్ ప్రకారం.. గత ఏడాది డిసెంబరు 4న రాత్రి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప2 సినిమా ప్రీమియర్ షో నిర్వహించారు. ఈ షోకు అల్లు అర్జున్ రావద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలగవచ్చని పోలీసులు ముందుగానే హెచ్చరించినప్పటికీ, థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులు, హీరో అల్లు అర్జున్ ఆ సూచనలను పట్టించుకోలేదని పేర్కొన్నారు.పోలీసుల అభ్యంతరాలను లెక్కచేయకుండా అల్లు అర్జున్ ప్రీమియర్ షోకు రావడం, థియేటర్‌కు కొంత దూరం నుంచే ఓపెన్‌టాప్ జీపులో అభిమానులకు అభివాదం చేస్తూ రావడం, బౌన్సర్లు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది జనాన్ని అడ్డుకోవడం, నెట్టివేయడం వంటి చర్యలతో పరిస్థితి అదుపు తప్పిందని చార్జిషీట్‌లో వివరించారు. ఈ క్రమంలో వందలాది మంది ఒకరిపై ఒకరు పడిపోవడంతో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ అపస్మారక స్థితికి చేరి ఇప్పటికీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఈ ఘటనలో థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులు, అల్లు అర్జున్, బౌన్సర్లు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు జరిపి, 50 మంది సాక్షులను విచారించినట్లు చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ వెల్లడించారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా 23 మంది ఈ దుర్ఘటనకు బాధ్యులని గుర్తించామని చెప్పారు.థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులను ఏ1, ఏ2గా, అల్లు అర్జున్‌ను ఏ11గా చేర్చినట్లు తెలిపారు. నిందితుల్లో థియేటర్ యాజమాన్యం, సిబ్బంది 10 మంది, 8 మంది బౌన్సర్లు, అల్లు అర్జున్, ఆయన వ్యక్తిగత సిబ్బంది నలుగురు ఉన్నారని వివరించారు. నిందితులపై ఐపీసీ సెక్షన్ 304 పార్ట్2 కింద అభియోగాలు నమోదు చేసినట్లు తెలిపారు. నేరం రుజువైతే గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉందని పోలీసులు స్పష్టం చేశారు.

## రైతుల్ని ఏకం చేయాలి

జరుగుతోందని మండిపడ్డారు. నరేగా రద్దు అంటే రాష్ట్రాల నిర్ణయాధికారాన్ని లాక్కోవడమేనని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలోని తొమ్మిది రాష్ట్రాల్లో ఇండియా కూటమికి చెందిన పార్టీలు అధికారంలో ఉన్నాయని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి, వారందరినీ కలుపుకుని నరేగాకు మద్దతుగా జాతీయ స్థాయి ఉద్యమం చేపట్టాలని సూచించారు. రైతులు, కూలీలను అవగాహనతో కూడిన పోరాటానికి సిద్ధం చేయాల్సిన సమయం వచ్చిందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ సంప్రదాయ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని కుట్రపూరిత విధానాలు అమలు చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. పాత చట్టాలను తొలగించి, కొత్త చట్టాల పేరుతో దళితులు, గిరిజనులు, మైనార్టీలను రాజకీయంగా బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ పేరుతో తమకు వ్యతిరేకంగా ఉండే వర్గాల ఓట్లను తొలగించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఓటు చోరీపై కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమానికి దేశవ్యాప్తంగా మంచి స్పందన లభించిందని, దాంతో బడుగు వర్గాలు పార్టీకి మరింత దగ్గరయ్యాయని తెలిపారు. నరేగా ఉద్యమంతో రైతాంగం కూడా కాంగ్రెస్ వైపు పూర్తిగా మొగ్గు చూపుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరయ్యేందుకు శుక్రవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి, శనివారం ఉదయం ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో స్నేహపూర్వకంగా ముచ్చటించారు. తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలు, పంచాయతీ ఎన్నికల ఫలితాలు, భవిష్యత్తు కార్యాచరణపై వారి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.

# రెండేళ్లకే కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైంది

మహబూబాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లే అయినా అప్పుడే తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇవాళ మహబూబాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ సర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలిచిన వారికి, స్వల్ప తేడాతో ఓడిన వారికి, పార్టీ కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో మాట్లాడుతూ కేటీఆర్ ఏమన్నారో ఆయన మాటల్లోనే.. 'బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన గౌరవ సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌లకు శుభాకాంక్షలు. గెలిచిన వారికేగాక అధికార పార్టీ డబ్బును, ఆగడాలను ఎదిరించి తక్కువ ఓట్ల తేడాతో ఓడిన బీఆర్ఎస్ తరఫు సర్పంచ్ అభ్యర్థులకు కూడా అభినందనలు తెలియజేస్తున్నా. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం అలుపెరగకుండా కృషిచేసిన కార్యకర్తలకు కూడా నా అభినందనలు. సాధారణంగా సర్పంచ్ ఎన్నికలకు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అధికార పార్టీకి అనుకూలంగానే ఫలితాలు వస్తాయి. అధికార పార్టీకి ఓటస్తే తమ ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుందని ఓటర్లు ఆలోచిస్తారు. కానీ ఇయ్యాల తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. కాంగ్రెస్ పార్టీకి ధీటుగా బీఆర్ఎస్ తరఫు అభ్యర్థులు కూడా విజయాలు సాధించారు' అన్నారు.'సర్పంచ్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని అడ్డంపెట్టుకుని తిమ్మినిబమ్మిని చేసే ప్రయత్నం చేసింది. స్వల్ప తేడాతో బీఆర్ఎస్ గెలిచిన చోట్ల రీ కౌంటింగ్ పేరు చెప్పి ఫలితాలను తారుమారు చేసింండ్రు. కొన్ని ప్రాంతాల్లో ముందుగా బీఆర్ఎస్ గెలిచినట్లు చెప్పి.. తర్వాత కాంగ్రెస్ గెలిచినట్లు ప్రకటించారు. ఒక్క మహబూబాబాద్ జిల్లాలోనే కాదు, దాదాపు అన్ని జిల్లాల్లో ఇలాంటివి జరిగాయి. కాంగ్రెస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా బీఆర్ఎస్ మంచి ఫలితాలు రాబట్టిందంటే ప్రజల్లో మార్పు వచ్చిందని అర్థం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లే అయినా అప్పుడే తిరుగుబాటు మొదలైంది' అని కేటీఆర్ చెప్పారు.

# గత సర్కార్ రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసింది

నేలకొండపల్లి మండలం అనంతనగర్‌లో రూ.2.25 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రారంభించారు. అదే గ్రామంలో రూ.1.75 కోట్లతో నిర్మించనున్న మరో సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల కోసం ప్రతి సంవత్సరం రూ.13,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 96 లక్షల పేద కుటుంబాలకు ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు కేటాయించిందని వెల్లడించారు.దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. రైతులకు భరోసా ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ధనిక రాష్ట్రమైన తెలంగాణను గత పాలకులు దోచుకుని రూ.8 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. పేదల ముఖంలో ఆనందం చూడాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రారంభిస్తామని ప్రకటించారు.

# కొన్ని పంచాయతీల్లో భారీ కుంభకోణాల్లో తమ చేతి వాటాన్ని ప్రదర్శించిన సెక్రటరీలు

**చెల్లి గవ్వ కూడా చెల్లించలేమని తేల్చేస్తూ నూతన సర్పంచ్ పాలకవర్గానికి స్వాగతం**

**లక్షల రూపాయలు స్వాహా - ఉపాధి హామీ కూలీలతో చేయించాల్సిన పనులను కూడా పంచాయితీ సిబ్బందితో చేయించి సొమ్ము చేసుకున్న వైనం**

**బట్టబయలైన పంచాయతీ ప్రత్యేక అధికారుల పనితీరు**




నవతరం,అశ్వారావుపేటనమ్మానురా సిద్ధ అంటే దొబ్బానురా అంతా అనే చందస్సుల తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలోకి వచ్చిన తర్వాత గత రెండు సంవత్సరాల గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు అక్కడక్కడ తమ చేతివాటాన్ని చూపించారు. అదంతా ఇంటి పన్నులు మొదలుకొని ప్రత్యేక అధికారుల సొంత ఇంటి పనుల కొరకు సొమ్ములు జమ చేసుకున్న వైనం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలంలో చోటుచేసుకుంది. కిందిస్థాయి ప్రత్యేక అధికారి మొదలుకొని మండల స్థాయి ఆపై స్థాయి అధికారులు సైతం తమ చేతివాటాన్ని ఇక్కడ ప్రదర్శించినట్లు బట్టబయలవుతోంది. ఈ కుంభకోణాలు ఒక్కొక్కటిగా ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. పంచాయతీ పరిధిలో పనిచేసే కార్మికులు తమ పనులను మాత్రమే కాకుండా ప్రత్యేక అధికారులు తీసుకున్న కాంట్రాక్టు పనులలో కూడా పాలుపంచుకొని, ఉపాధి హామీ కూలీల ద్వారా చేయించాల్సిన పనులలో సైతం వాడుకొని ఈ ప్రత్యేక అధికారులు పంచాయతీ సిబ్బందికిప్పించాల్సిన జీతాలను వారికి ఇప్పిస్తూనే, ప్రభుత్వంచే జారి అయిన బిల్లులను లెక్కలకు పై లెక్కలు వేస్తూ ప్రజా సొమ్మును తమ జేబులో నింపుకున్నారు. దానికి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ త్వరలో మన నవతరం న్యూస్ పేపర్లో బట్టబయలు కాబోతున్నాయి. ఇదిలా ఉండగా, మరో కొత్త కోణం ఏమిటంటే చాలామంది గ్రామపంచాయతీ సెక్రటరీలు ప్రత్యేక అధికారులుగా నియమింపబడి తమ పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చే జీతభత్యాలు చెల్లిస్తూ, వారికిచ్చే కాంట్రాక్టు బిల్లుల పనుల్లో సైతం వాడుకునీ ఆ సొమ్మును కూడా ప్రత్యేక అధికారులు తమ ఖాతాలో జమ చేసుకున్న వైనం అక్కడక్కడ బట్టబయలైంది. కనీసం సర్పంచ్ ఎన్నికల్లో గెలుపు సాధించిన పాలకవర్గానికి స్వాగతం పలకడానికి ఒక్క రూపాయి కూడా చెల్లించలేమని ఈ ప్రత్యేక అధికారులు చేతులెత్తేసిన వైనం అక్కడక్కడ చోటు చేసుకుంది. మంచినీళ్లను సైతం అందించలేని స్థితిలో తాము ఉన్నామని దిగజారుతూ మాట్లాడిన విధానం తనకు కనిపించింది. ఈ విధానం అశ్వారావుపేట మండలంలో మేజర్ పంచాయతీల్లో బట్టబయలైంది. ఇంకా తామే అధికారం చలాయించాలనే ఉక్రోషాన్ని ప్రదర్శించడం జరిగింది. ఇటువంటి పరిస్థితిని ప్రజలు ఆడిపోసుకుంటున్నారు. విద్యుత్ దీపాల వంటి మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక అధికారుల పనితీరు ఏకపక్షంగా చేయాలనే చూస్తున్నారు తప్ప, ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కాబడిన సర్పంచ్ వార్డు మెంబర్ల అధికారానికి తావివ్వకుండా చేయాలనే చూస్తున్నట్లు సమాచారం. ఇదంతా గోతి కాడ నక్కలా ఎదురుచూస్తున్న నక్కలా పాలకవర్గాన్ని సైతం తమ చేతుల్లోకి లాక్కోవాలని చూస్తున్నట్లు సమాచారం. కుంభకోణాల కు అలవాటు పడిన ఈ ప్రత్యేక అధికారుల పనితీరు ఇంకా అలానే మిగిలి ఉండడం పలువురనీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఏ పదవికి ఎలాంటి గౌరవం ఇవ్వాలి అనే ఆలోచనను వీడి తమ చేతి వాట ప్రదర్శనను ఇంకా కొనసాగించాలనీ చూడడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కొన్ని పంచాయతీల్లోనైతే తామే రూలర్లమంటూ పంచాయతీ ప్రజాప్రతినిధులను ఇంకా చిన్న చూపు చూడడం విశేషమైనది. ఇలాంటి బాధిత ప్రజా ప్రతినిధి పాలకవర్గం అయోమయ స్థితిలో పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అలాంటి పంచాయతీ పాలకవర్గం తమకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేలను తమకు సహకరించాలని కోరడం విశేషం.

# బెల్ట్ షాపులు లేకపోతే ప్రభుత్వం నడవదు




వైరల్ గా మారిన సంగారెడ్డి జిల్లా పుల్కల్ ఎక్సైజ్ పోలీసుల ఆడియో రికార్డింగ్‌లి చర్యలు తీసుకోవాలని మండిపడుతున్న నెటిజెన్లుసంగారెడ్డి, నవతరం: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం లక్ష్మీ సాగర్ గ్రామంలో బెల్ట్ షాపుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో అక్రమ మద్యం విక్రయాల వల్ల శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయని, కుటుంబాలు నాశనమవుతున్నాయని గ్రామ సర్పంచ్ ఆందోళన వ్యక్తం చేస్తూ పుల్కల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే ఈ ఫిర్యాదుకు సర్కిల్ ఇన్స్పెక్టర్ స్పందించిన తీరుపై ఇప్పుడు తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "బెల్ట్ షాపులు లేకపోతే ప్రభుత్వం ఎలా నడుస్తుంది?" అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడినట్టు సర్పంచ్ ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యలను వినాల్సిన బాధ్యత ఉన్న అధికారుల నుంచే ఇలాంటి వ్యాఖ్యలు రావడం పట్ల గ్రామస్థులు విస్తుపోతున్నారు. బెల్ట్ షాపులు గ్రామీణ సమాజాన్ని ఎలా కుంగదీస్తున్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కూలీల కష్టార్జితం మద్యం దుకాణాల్లో కరిగిపోతోంది. కుటుంబాల్లో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు, మహిళలపై హింస వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గ్రామ సర్పంచ్ చేసిన ఫిర్యాదు ప్రజాప్రతినిధిగా ఆయన బాధ్యతను చాటుతుంది. కానీ, ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాల్సిన అధికారే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల అనేక అనుమానాలకు తావిస్తోంది. సోషల్ మీడియాలో స్పందించిన నెటిజన్లు, బెల్ట్ షాపుల నుంచి పోలీస్ అధికారులకు మామూళ్లు అందుతున్నాయేమో అన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇవి కేవలం ప్రజాభిప్రాయాలే అయినప్పటికీ, అధికారుల వైఖరే ఇలాంటి అనుమానాలకు కారణమవుతుందన్నది వాస్తవం. ప్రభుత్వం మద్యం ద్వారా ఆదాయం సంపాదిస్తుందన్నది తెలిసిన విషయమే. కానీ ఆ ఆదాయం పేరుతో అక్రమ బెల్ట్ షాపులను అనుమతించడం, ప్రజల జీవితాలతో చెలగాటమాడడమే అవుతుంది. చట్టవిరుద్ధమైన మద్యం విక్రయాలను అరికట్టాల్సిన బాధ్యత పోలీస్ శాఖపై ఉంది. ప్రజాప్రతినిధులు చేసే ఫిర్యాదులను తేలికగా తీసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి, సీఐ వ్యాఖ్యలపై విచారణ జరపాలని, పుల్కల్ గ్రామంలో బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే పాలన పారదర్శకంగా, బాధ్యతాయుతంగా ఉండాల్సిందే.


## అక్షరం...ఒక ఆశల పందిరి...అక్షరం


పోలయ్య కూకట్లపల్లి

నా ఆశఅక్షరం...
నా శ్వాసఅక్షరం...
నా ప్రాణంఅక్షరం...
నా ఊపిరిఅక్షరం...ద
ఒక ఔషధంఅక్షరం...
ఒక ఆక్సిజన్అక్షరం...
ఒక నవ్వే నక్షత్రం
అక్షరం ఒక వజ్రాయుధంఅక్షరం...
అందని ద్రాక్షఅక్షరం...
ఓ శ్రీరామ రక్షఅక్షరం...
ఒక శిలువ శిక్షఅక్షరం...
ఒక అగ్ని పరీక్షఅక్షరం...
ఒక అక్షయ పాత్రఅక్షరం...
ఒక విహార యాత్రఅక్షరం...
ఒక అగ్నిగుండంఅక్షరం...
ఒక అమృతభాండంఅక్షరం...
అనంతమైన ఆకాశంఅక్షరం...
అంతేలేని అంతరిక్షంఅక్షరం...
ఆరని ఒక అగ్నికణంఅక్షరం...
ఒక అందాల బృందావనంఅక్షరం...
అందిన వారికి అమృతంఅక్షరం...
అందకపోతే విషవలయంఅకరం...
అరుణోదయం ఆహ్లాదకరం అక్షరం...
ఒక సుందర సూర్యోదయంఅక్షరం...
వెయ్యేనుగుల బలంఅక్షరం...
అంధకారం అథ'పాతాళంఅక్షరం...
ఒక గుడి అక్షరం ఒక బడిఅక్షరం...
ఒక మణి మాణిక్యాల మడిఅక్షరం...
చదువుల తల్లి సరస్వతి ఒడి

**రచన:కవి రత్నసాహిత్య ధీరసహస్ర**
**కవి భూషణ్ పోలయ్య**
**కూకట్లపల్లిఅత్తాపూర్ హైదరాబాద్**

# ప్రభుత్వ కార్యాలయంలో వాహనాల ఛార్జింగ్





కొందుర్గు, నవతరం: ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవలు అందించడానికి నిర్దేశించినవి. కానీ, రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. కార్యాలయానికి చెందిన ప్రభుత్వ విద్యుత్తును వ్యక్తిగత వాహనాల ఛార్జింగ్ కోసం వాడుతుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ప్రజా ధనం.. అధికారుల విలాసం?కార్యాలయంలో విధులు నిర్వహించే కొందరు సిబ్బంది లేదా అధికారులు తమ సొంత ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్లను ఆఫీసు లోపల ఉన్న ప్లగ్ పాయింట్లకు కనెక్ట్ చేసి గంటల తరబడి ఛార్జింగ్ పెడుతున్నారు. కార్యాలయ విద్యుత్ బిల్లులను ప్రభుత్వం ప్రజల పన్నుల రూపంలో చెల్లిస్తుంటే, ఆ విద్యుత్తును సొంత వాహనాలకు వాడుకోవడం ఏంటని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు.నిబంధనలు ఏం చెబుతున్నాయి?సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లోని విద్యుత్ కేవలం కంప్యూటర్లు, లైట్లు, ఫ్యాన్లు మరియు ఇతర అధికారిక పరికరాల కోసం మాత్రమే వినియోగించాలి. వ్యక్తిగత ఎలక్ట్రిక్ వాహనాలను ఛార్జింగ్ చేసుకోవడం నిబంధనలకు విరుద్ధం. ఒక్కో స్కూటర్ పూర్తి ఛార్జింగ్‌కు సుమారు 3 నుండి 4 యూనిట్ల విద్యుత్ ఖర్చవుతుంది. ఇలా ప్రతిరోజూ ఛార్జింగ్ చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతోంది.స్థానికుల ఆగ్రహం..."మేము మా ఇంట్లో ఛార్జింగ్ పెట్టుకుంటే బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతుంటే, ఇక్కడ అధికారులు మాత్రం ప్రజల సొమ్ముతో ఉచితంగా తిరుగుతున్నారు" అని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి పనులకు అడ్డుకట్ట వేయాలని, ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగాన్ని అరికట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## జర్నలిస్టుల అరెస్టును తీవ్రంగా ఖండించిన కేటీఆర్

**ప్రజల గొంతుక జర్నలిస్టులను అరెస్టు చేయడం, నిర్బంధించడం కాంగ్రెస్ నిరంకుశత్వానికి నిదర్శనం**

**ప్రజాస్వామిక పరిరక్షణ అంటూ కాంగ్రెస్ ఇచ్చిన ఏడవ గ్యారంటీ ఇదేనా అన్న కేటీఆర్**

**జర్నలిస్టుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఇచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్**



హైదరాబాద్, నవతరం: జర్నలిస్టుల సమస్యలపై శాంతి యుతంగా వినతిపత్రాలు ఇచ్చేందుకు వెళ్లిన టీయుడబ్ల్యూజే టీజేఎఫ్ నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది కేవలం నేతల అరెస్టు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే జర్నలిస్టుల గొంతును పోలీసు బలగాలతో నొక్కేసే కుట్ర అని ఆయన విమర్శించారు. కొత్త జీవో సాకుతో జర్నలిస్టుల అక్రిడి టేషన్లలో కోత విధించడం ద్వారా ప్రభుత్వం వారి ప్రాథ మిక హక్కులను కాలరాస్తోందని, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం నిరంకుశత్వానికి నిద ర్శనమని మండిపడ్డారు. ప్రజలను మభ్య పెట్టేందుకు వచ్చిన ఆరు గ్యారంటీ లతో పాటు ప్రజాస్వామిక పరిరక్షణ పేరుతో ఇచ్చిన ఏడవ గ్యారెంటీ అంటే జర్నలిస్టులను అరెస్టు చేయడమేన అన్నారు. క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయాల్సింది పోయి, ఉన్న వాటిని తొలగించడం ద్వారా ప్రభుత్వం వారి ఉపాధిని మరియు ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని అన్నారు. మారుతి సాగర్, రమేశ్ హజారి, యోగానంద్, విష్ణువర్ధన్ రెడ్డి, రమణ కుమార్, కడకంచి వెంకట్ వంటి కీలక నేతలను అరెస్ట్ చేయడం దారుణం అన్నారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను, నిర్బంధాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ, అక్రిడిటేషన్ల పునరుద్ధరణ కోసం సాగే పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.



## ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి

కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌కుత్బుల్లాపూర్, నవతరం: నియోజవర్గంలోని గాజులరామారం డివిజన్ వెంకటాద్రి హిల్స్ (హెచ్ఏఎల్ కాలనీ) లోని శ్రీ సత్యనారాయణ స్వామి లక్ష్మీ దేవస్థానం 29వ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఈ దేవాలయం చాలా ప్రసిద్ధి చెందినదని, సత్యనారాయణ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలందరూ సత్యనారాయణ స్వామి దయవల్ల సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సిహెచ్ బుచ్చిరెడ్డి, ఆలయ ధర్మకర్త గణేష్ సింగ్, సురేందర్ సింగ్, రాం నారాయణ, సుబ్బారాయుడు, వెంకట సుబ్బయ్య, యాదగిరి, రాజు పంతులు, ఆలయ కమిటీ వారు భక్తులు పాల్గొన్నారు.



## టీయూడబ్ల్యూజే టీజెఫ్ నేతల అరెస్టు

హైదరాబాద్, నవతరం: కొత్త జీవో పేరుతో జర్నలిస్టుల ఆక్రిడేషన్ లను కోత పెట్టడాన్ని నిరసిస్తూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు శాంతియుత పద్ధతిలో వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన టీ యూడబ్ల్యూజే టీజెఫ్ నేతలను అక్రమంగా అరెస్టు చేశారు పోలీసులు. టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, ఉపాధ్యక్షులు రమేశ్ హజారి, కోశాధికారి యోగానంద్, టెంజు అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, ఐజేయూ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్, హైదరాబాద్ జిల్లా ఇంచార్జీ నవీన్ కుమార్, నేతలు బాపురావు, భాస్కర్, ప్రెస్ క్లబ్ మెంబర్ అశోక్ దయాళ్, వీ5 సీఈఓ కడకంచి వెంకట్, సువర్ణ, రామకృష్ణ రెడ్డి, దేవేందర్, సంతోష్, తదిరులు అరెస్టు చేసిన వారిలో ఉన్నారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టు లను ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.



## జెవిఆర్ ఓపెన్‌మైన్‌ను పరిశీలించిన భట్టి విక్రమార్క

సత్తుపల్లి, నవతరం: తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సత్తుపల్లిలోని జెవిఆర్ ఓపెన్ మైన్‌ను పరిశీలించి బొగ్గు వెలికితీత, రవాణా, శ్రామిక శక్తి, భద్రత మరియు డిస్పాచ్ వంటి కార్యకలాపాలను సమీక్షించారు. సింగరేణి వృద్ధి ప్రణాళికలను కూడా ఆయన వివరించారు. ప్రపంచ విస్తరణ, తెలంగాణ బొగ్గు బ్లాకులను భద్రపరచడం, అరుదైన భూమి, కీలకమైన ఖనిజాలలోకి ప్రవేశించడం మరియు థర్మల్ అండ్ గ్రీన్ ఎనర్జీని విస్తరించడం, 85,000 మంది ఉద్యోగులకు స్థిరమైన వృద్ధిని నిర్ధారించడం జరిగింది.

## ఆంధ్ర వడ్లు, తెలంగాణలో 500 బోనస్ కోసమే అమ్మకాలా? వ్యవసాయ శాఖ తనిఖీ అధికారులు ఏం చేస్తున్నారు?



నవతరం,అశ్వారావుపేటభద్రాచలం పరిసర ప్రాంతాలలో ఉన్న ఆంధ్ర ప్రాంతాల నుంచి, కొంతమంది వ్యాపారులు అక్రమంగా వడ్లు కొనుగోలు చేసి, తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇచ్చే క్వింటాకు 500 బోనస్ కోసం ఆంధ్ర వడ్లు తెలంగాణలో మసి బూసి మారేడు కాయ చేసి అమ్ముకుంటూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు? ఇదంతా ఒక ఎత్తు అయితే ఇంత జరుగుతున్న సంబంధిత వ్యవసాయ శాఖ తనిఖీ అధికారులు భద్రాచలంలో మొక్కుబడుగా మాత్రమే తనిఖీలు నిర్వహిస్తూ, అక్రమ వడ్ల అమ్మకానికి పరోక్షంగా సహకరిస్తున్నారని అనేక విమర్శలు వినిపిస్తున్నాయి... అసలు ఈ అక్రమ వడ్ల లారీలు వెళుతుంటే కనీసం భద్రాచలం వ్యవసాయ తనిఖీ కేంద్రం వద్ద ఆగుతున్నాయా లేదా ఒకవేళ ఆగితే ఎటువంటి కాగితాలు చూపించి వెళుతున్నారనేది అర్థం కాని పరిస్థితి ఏది ఏమైనా ఆంధ్రాలో వడ్లుకొని తెలంగాణలో అమ్ముకుంటున్న అక్రమ వ్యాపారులపై, అదే విధంగా వారికి సహకరిస్తున్న వారిపై విచారణ జరిపి, అవసరమైతే సీసీ కెమెరాలు పుటేజులు చెక్ చేసి, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు...

# నేటి బాలలే రేపటి పౌరులు, భవిష్యత్ నిర్నేతలు

## ఆలివ్ స్వీట్స్ అకాడమిక్ ఎక్సలెన్సర్ అవార్డు కార్యక్రమంలో మాధవరం కృష్ణారావు







కూకట్పల్లి / హైదరాబాద్, నవతరం: విద్యార్థులు తాము చదువుకునే విద్యలో రాణించగలిగితే సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తారని కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. తల్లిదండ్రులు, చదువు చెప్పిన గురువులు ఎన్నటికీ మరవకూడదని సూచించారు. శనివారం కూకట్ పల్లి కేపి.హెచ్.బి కాలనీ లోని పీ ఎం ఆర్ ఎంపైర్ లో "ఆలివ్ స్వీట్స్ అకాడమిక్ ఎక్సలెన్సర్" అవార్డు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం మూసాపేట్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదవ తరగతిలో 600 మార్కులకు గాను 579 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్ ర్యాంకు తెచ్చుకున్న జనం సోనియాను అభినందించి ఆలివ్ అకాడమిక్ ఎక్సెన్స్ అవార్డు తరఫున లక్ష రూపాయల చెక్కును సోనియాతో పాటు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా మిగతా 12 మంది విద్యార్థులకు పదివేల చొప్పున చెక్స్ ను సంస్థ వ్యవస్థాపకుడు దొర రాజు అందజేశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అండగా నిలుస్తూ పదో తరగతిలో ప్రతిభ కనబరుస్తున్న వారిని గుర్తించి ప్రతి సంవత్సరం ఇలానే నగదు బహుమతిని అందజేస్తున్నామని దొర రాజు ప్రకటించారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ కార్యక్రమం కొనసాగుతూనే ఉందని అన్నారు. నేడు రెండు లక్షల 20వేల రూపాయల నగదు బహుమతిని విద్యార్థులకు అందించామని అన్నారు. త్వరలో జరగబోయే పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈసారి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా మొదటి బహుమతి సాధించిన సోనియా కుటుంబ సభ్యులకు మొట్టమొదటి ఫ్లైట్ ఎక్స్పీరియన్స్ సైతం తమ సంస్థ నుండి వారికి గిఫ్ట్ రూపేనా అందజేస్తామని తెలిపారు.

# ముదిరాజ్ సర్పంచుల సన్మానసభను విజయవంతం చేయండి!

## తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్





హైదరాబాద్, డిసెంబర్ 27, నవతరం:సికింద్రాబాద్ ప్రెస్ క్లబ్లో శనివారం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. డిసెంబర్ 30 వ తేదీన హైదరాబాద్లోని రవీంద్ర భారతీ ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు జరగనున్న ముదిరాజ్ సర్పంచుల సన్మాన కార్యక్రమంను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ముదిరాజ్ సమాజం మొత్తం సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సన్మాన సభ ముదిరాజ్ సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి ముదిరాజ్ సర్పంచ్ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు.సాంకేతిక కారణాల వల్ల ఎవరికైనా వ్యక్తిగతంగా ఫోన్ కాల్ లేదా ఆహ్వానం అందకపోయినా, ఈ ప్రకటనను అధికారిక ఆహ్వానంగా భావించి కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన అన్నారు. అదేవిధంగా, ప్రతి ముదిరాజ్ కులస్తుడు ఈ వేడుకను తమ స్వగృహ కార్యక్రమంగా భావించి పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ స్థాయిలో ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో సేవలందిస్తున్న ముదిరాజ్ సర్పంచుల సేవలను గుర్తించి గౌరవించేందుకు ఈ సన్మాన సభ ఒక చారిత్రక వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# గుత్తి కోయలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

కొండ్రెడ్ల అభివృద్ధికై మేము వెనుకాడబోము

వ్యవసాయ రంగాల్లో వారు అభివృద్ధి చెందాలి

వర్ణించిన తుమ్మల నాగేశ్వరరావు చారే ఆదినారాయణ

కౌజు పిట్టల పెంపకం పెంపొందించుకోవాలి



నవతరం, అశ్వారావుపేట మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసించే కొండరెడ్లలో గిరిజన కుటుంబాలలో వెలుగులు నింపేలా ఐటీడీఏ ప్రణాళికలు సిద్ధం చేసి ఆర్థికంగా అభివృద్ధి చెంది జీవనోపాధి పెంపొందించుకోవడానికి జిల్లా కలెక్టర్ మరియు ఐటీడీఏ పీవో అన్ని శాఖల అధికారులతో నెలవారి మాస్టర్ ప్లాన్ తయారుచేసి శాశ్వత నిర్మాణాలు చేపట్టి పూసుకుంట గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ చేనేత జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.దమ్మపేట మండలం పూసుకుంట గ్రామంలో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొండరెడ్ల గిరిజనుల కుటుంబాలతో పాటు ఎన్నో ఏళ్లుగా జీవిస్తున్న గుత్తి కోయ కుటుంబాలకు కూడా అన్ని సౌకర్యాలు కల్పించాలని, ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయం అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని, చేతివృత్తులు అంతరించకుండా ఐటీడీఏ ఆధ్వర్యంలో చేయూత అందించాలని, కొండరెడ్ల గిరిజన కుటుంబాల అభివృద్ధికి తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు ద్వారా ఎన్ని కోట్లయినా ఖర్చు పెట్టడానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు అన్నారు. ముఖ్యంగా ఈ గ్రామంలో సబ్ సెంటర్ నిర్మాణం, అంగనవాడి భవనము, పాఠశాల భవనానికి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. పిల్లలు ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా సంబంధిత ఉపాధ్యాయులు చూడాలని, ఐదవ తరగతి కంటే పై చదువులు చదివే పిల్లలు ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న గురుకుల పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వ్యవసాయం చేసుకుంటున్న రైతుల భూముల వివరాలు, చిన్న పిల్లలకు హెల్త్ కార్డులు, జీవిత బీమా సౌకర్యం అలాగే మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని అన్నారు. ప్రతి రైతు పంట పొలాలలో ఉన్న జామాయిల్ చెట్లను తీయించివేసి పామాయిల్ చెట్ల మొక్కలను వేయించి అంతర్ పంటలుగా కూరగాయలు కానీ ఇతర పంటలు వేసుకొని జీవనోపాధి పెంపొందించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. కొండరెడ్ల కుటుంబాలు కోరిన విధంగా ఏప్రిల్ వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని అలాగే సబ్ సెంటర్ నిర్మాణం గ్రామపంచాయతీ భవనం పామాయిల్ మొక్కల పెంచుకునే కుటుంబాలకు బోరు సోలార్ తో కరెంటు సౌకర్యం కల్పిస్తామని, ఇందిరమ్మ ఇండ్లు రాని కుటుంబాలకు త్వరలో అందరికీ ఇండ్లు వచ్చేలా చూస్తామని అన్నారు. కొండరెడ్ల గ్రామాలకు క్యాజ్ వేలు, చెప్తాల నిర్మాణం, రోడ్డు సౌకర్యం కొరకు దాదాపు 30 కోట్ల రూపాయలు కేటాయించామని ఏప్రిల్ మాసానికి పనులు ప్రారంభించాలని అన్నారు. అలాగే కొండ రెడ్ల గిరిజన కుటుంబాలలోని ప్రతి సభ్యుడు సంవత్సరానికి ₹1000 చెల్లిస్తే ఐదు రకాల ప్రమాదాల వలన 15 లక్షల రూపాయలు బీమా వస్తుందని సంబంధిత అధికారులు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించాలని అన్నారు. నాగరిక సమాజంలో ఎలాంటి సౌకర్యాలు ఉంటాయో అదే రీతిలో ఆదివాసి గిరిజన గ్రామాలలో ఉండేలా సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రాధాన్యమని ఆయన అన్నారు.



## నూతన జెడ్‌సీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన గుబ్బల లక్ష్మీనారాయణ




కుత్బుల్లాపూర్, నవతరం: డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా కొత్తగా డివిజన్లను పెంచుతూ నూతన జోనల్ కమిషనర్లను నియమించిన సందర్భంగా... కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో నూతన జోనల్ కమిషనర్ సందీప్ కుమార్ ఝా ను సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి, కుత్బుల్లాపూర్ జోన్ అభివృద్ధి దిశగా సమర్థవంతమైన పరిపాలన అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ నాయక్ నగర్ మాజీ ప్రెసిడెంట్ ఆలూరి వెంకట శేషాచారి, ప్రభాకర్, కిషోర్ కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై ప్రత్యేకంగా నిఘా

సైబరాబాద్, నవతరం: (20.12.2025 నుండి 27.12.2025 వరకు) సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక నైట్ రైడ్స్‌లో భాగంగా (02) మంది సెక్స్ వర్కర్లు మరియు (05) మంది ట్రాన్స్‌జెండర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా (03) పిటా కేసులలో (05) మంది బాధితులను రక్షించి, (10) మంది నిందితులను అరెస్ట్ చేశారు. సైబరాబాద్ షీ టీమ్స్ 209 డికాయ్ ఆపరేషన్లు నిర్వహించి, ప్రజాస్థలాల్లో అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడుతున్న 51 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మొత్తం 58 కేసులు నమోదు చేయగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ అందించారు. అలాగే షీ టీమ్స్‌కు మహిళల నుంచి వివిధ మార్గాల ద్వారా 22 ఫిర్యాదులు అందాయి. కుటుంబ సమస్యలతో బాధపడుతున్న భార్యాభర్తల మధ్య సమన్వయం సాధించేందుకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు / సీడీఈడబ్ల్యూ సెంటర్ల ద్వారా 21 కుటుంబాలను కలిపే ప్రయత్నాలు చేపట్టారు.నివారణ మరియు అవగాహన కార్యక్రమాల భాగంగా, ఏహెచ్ టీయూ మరియు షీ టీమ్స్ సైబరాబాద్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. వీటిలో మొత్తం 4112 మంది పాల్గొని, మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ, స్టాకింగ్, భిక్షాటన, సైబర్ బుల్లీయింగ్, సైబర్ మోసాలు వంటి అంశాలపై అవగాహన పొందారు. అలాగే మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100, సైబర్ నేరాల కోసం 1930 వంటి సేవలపై సమాచారం అందించారు.

## సూరారంలో యువకుడు ఆత్మహత్య



కుత్బుల్లాపూర్, నవతరం: సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్లైన్ గేమ్స్ కి అలవాటు పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవీందర్ అనే వ్యక్తి తాను ఆన్లైన్ గేమ్స్ లో పెట్టుబడి పెట్టి మోసపోయానని వీడియో రికార్డు చేసుకుని, తన చావుకు ఎవరు బాధ్యులు కారు అని సూరారంలోని తన గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకి పాల్పడినట్టు సమాచారం. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## స్నేహితుడు కుటుంబానికి ఆర్థిక సాయం

గుమ్మడిదల మున్సిపాలిటీ, డిసెంబర్ 26 (నవతరం): స్నేహితులు కేవలం సుఖాల్లోనే కాదు కష్టాలలో తోడుంటామని నిరూపించారు. మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన బైండ్ల రమేష్ అనారోగ్య సమస్యతో ఇటీవల మృతి చెందగా... మిత్రుని కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని గుమ్మడిదల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998–99 బ్యాచ్ మిత్రులు తమ వంతు సహాయంగా అతని భార్యకి 1,32,100/- అందజేసి వారి ఇద్దరి కుమారుల పైన ఎస్బిఐ బ్యాంకు లో ఫిక్స్డ్ డిపాజిట్ చేశారు. భవిష్యత్తులోనూ అతని భార్యా పిల్లలకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు.

## ఏపీకి ఏడాదిలోనే 9500 కోట్ల రైల్వే ప్రాజెక్టులు

రాష్ట్రవ్యాప్తంగా 1,560 కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాల నిర్మాణం కొనసాగుతోందని వెల్లడికేంద్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌లో రూ.9,470 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు అనుమతినిచ్చినట్లు కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎనిమిది వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయని, దేశంలోనే తొలిసారిగా హిందూపురంలో తాలూకా స్థాయిలో వందేభారత్‌కు స్టాపింగ్ కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇది హిందూపురం ప్రజలకు ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన ప్రత్యేక బహుమతి అని ఆయన అన్నారు.శనివారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం, సోమందేపల్లిలో పర్యటించారు. సోమందేపల్లి మండలం చాకర్లపల్లి వద్ద రూ.4 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన రైల్వే స్టేషన్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం హిందూపురం చేరుకున్న మంత్రి, ఎంపీ బీకే పార్థసారథితో కలిసి యశ్వంత్‌పూర్ – హైదరాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు హిందూపురంలో స్టాపింగ్‌ను ప్రారంభించారు.

Owned and Published by Sirigiri Varadaraju, Printed at: Shesha Sai Enterprises, Plot No. 98/1, CIE, Phase 2, Gandhinagar, Hyderabad - 37, Telangana State, India, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com